కథ

# కోరని బ్రతుకు



"షకీలా... షకీలా బేగమ్..."

"షకీలా నిన్నే పిలుస్తూందేది" మావారు చేత్తో నా నడుం మీద నొక్కి చెప్పినప్పుడు అదిరి కళ్లు తెరిచాను.

"ఆ..."

"చూడు... ఆ నర్స్ పిలుస్తుంది నిన్ను. వెళ్లు. ఏం సుస్తీగా వుందా? నొప్పిగా వుందా?" మావారు అడిగారు.

"లేదు.. ఏం లేదు. వెళ్తాను"అంటూ బెంచీని ఆసరా చేసుకుని పైకి లేచాను.

"మీరేనా షకీలా బేగం...? త్వరగా రండి" తెల్లని స్కర్ట్ ధరించి, తలకు తెల్లని టోపీ పెట్టుకున్న పిన్నవయసుగల కులుకులొలికే నర్స్ వేగంగా ముందుకు నడుస్తూంది.

'నా శరీర భారాన్ని మోసుకుని ఆమె వెనకాల ఆమెలాగే వేగంగా నడవడం నావల్ల అయ్యే పనా? పైగా ఈ కడుపునొప్పి వేరే... లేచి వెంటనే నడువలేని మోకాళ్ల నొప్పి వేరే... వీటన్నింటికీ తోడుగా ఒళ్లంతా పరచుకున్న ఈ నల్లని బురఖా...'

"మీరు...? మీరు... రారా?" వారివంక చూశాను.

"నువ్వెళ్లు... మగ డాక్టరు అయితే మాత్రం బయటికొచ్చి నన్ను పిలు..." వారి దృష్టి అప్పుడే లోపలికొచ్చిన ఓ పిల్లవైపుంది. ఒకప్పుడు నేను వికసించిన కన్నులతో వారివైపు చూస్తే చాలు ఏమడిగినా అది చేసేవారు. నేను పెదవులు విప్పి నవ్వితే చాలు, అడిగింది తెచ్చిపెట్టేవారు... ఇప్పుడు... ఇప్పుడు... నావైపు చూడడమే వారికి బేజారు.

"బుర్ఖా ధరించి తీరాలి... లేకపోతే రోడ్డున వెళ్తున్నవారందరూ... ఎర్రని నీ వొంటి ఛాయకు, గుండ్రంగా ద్రాక్షల్లా ఉన్న నీ నల్లని కళ్ల అందానికీ, దొండపండులాంటి నీ ఎర్రని పెదవులకు దాసులైపోతారు. ఆ తర్వాత నిన్నెవరైనా ఎగరేసుకుపోతే నా గతేం కాను బేగం..." అంటూ వారు నా కళ్లల్లో కళ్లుంచి చెప్పినప్పుడు నేనెంతో పరవశించాను.

కన్నడమూలం: **బేడద బదుకు**
రచయిత్రి: **శ్రీమతి గీతా**
తెలుగు అనువాదం: **కలుమంగి కృష్ణమూర్తి**

బింకంతో నవ్వి, ఎంబ్రాయిడరీ చేసిన నాలుగు బుర్ఖాలను ఒకేసారి కొనివుంటిని. ఇప్పుడు...

"త్వరగా వెళ్లు..."

"ఊఁ... ఊఁ..."

"ఏ రూమో తెలుసా?"

"ఊఁ..."

మెల్లగా రూమ్ వాకిలి దగ్గరకు వెళ్తున్న సమయంలోనే మళ్లీ అదే నర్స్ తలుపు తెరిచి బయటికొచ్చింది.

"త్వరగా రాకూడదూ? మీకోసం డాక్టరు వేచియుండాలా, వారికి వేరే పనులు లేవనుకున్నావా?" నర్స్ మాటలు నేరుగా తాకాయి. పేలవంగా నవ్వటం తప్ప ఇంకేమీ చెయ్యలేకపోయాను.

"సర్లెండి... లోపలికి రండి... ఏమిటి ప్రాబ్లమ్?" మృదువుగా పిలిచిన డాక్టరు దగ్గరకు వెళ్లి, నా ఫైల్‌ను వారి ముందుంచాను.

"నమస్కారం డాక్టరుగారూ..." చేతులు జోడిస్తూ అన్నాను.

"నమస్కారం. కూర్చోండి" ఫైల్ తీసి అందులోకి కళ్లాడించారు.

డాక్టరుది ఇంకా చిన్నవయసు. కుర్రవాడు. సౌమ్యమైన కళ, నవ్వు మొఖం. సరియైన వయసులో సంతానం కలిగివుంటే ఈ వయసు కొడుకు వుండేవాడు నాకు. ఎదలో ఏదో మీటినట్టయ్యింది. ఈ కుర్రవాడు పెద్ద

మగవాడు అని చెప్పి నా మొగుణ్ణెందుకు పిలవాలనుకుని అలాగే కూర్చున్నాను.

"ఎవరైనా తోడు వచ్చారా?" అడిగాడు డాక్టరు.

"ఊఁ... మా సాయిబుగారు వచ్చారు..." అన్నాను.

"సిస్టర్! ప్లీజ్, వారిని పిలుచుకురండి... నొప్పి ఎక్కువగా ఉందామ్మా..." డాక్టరు అడిగారు.

గొడ్రాలిని 'అమ్మా' అని పిలిచి గౌరవించిన ఎవరో కన్నబిడ్డ వైపు చూశాను... నొప్పిగా వుందని చెప్పటానికి నోరే రావటం లేదు.

"లేదు..." అని చెప్పడమూ, నా సాయిబుగారు లోనికి రావడమూ ఒకేసారి జరిగాయి.

"ఏమిటి లేదంటున్నావ్?" కనుబొమలను పైకి చేశారు సాయిబుగారు.

"నొప్పి... నొప్పిగా లేదని చెబుతున్నారు..." చెప్పారు డాక్టరు.

"ఇంట్లోనేమో నొప్పి... నొప్పి అని బొబ్బలెట్టావ్... ఇక్కడకొచ్చి నొప్పి లేదంటావ్" పైకి లేచిన సాయిబుగారి కనుబొమలు ముడిగా మారాయి.

"పేన్ కిల్లర్స్ ఇచ్చుంటారు కదా... అందుకే అలా అంటున్నారు. చూడండి సార్.. అన్ని టెస్ట్‌లూ ముగిసాయి. స్కానింగ్ కూడా అయింది. అన్ని టెస్టులూ చెప్పేది ఒక్కటే... క్యాన్సర్... బాగా స్ప్రెడ్ అయింది. మిగతా ఆర్గన్స్‌ని ఆవరించే ముందే ఆపరేషన్ జరగాలి. అందుకు ఆస్పత్రివారు ఈ కేసును నాకప్పగించారు. మీకు ఎప్పుడు అనుకూలంగా వుంటుందో చూసుకుని డేట్ ఫిక్స్ చేయండి. అయినంత త్వరగా చెయ్యటం మంచిది" డాక్టరుగారు మావారితో చెప్పారు.

"ఇలాగే పేన్ కిల్లర్ మాత్రలు, ఇంజక్షన్స్ ఇస్తూ వుంటే చాలదా? ఆపరేషన్ ఎందుకు చేయాలి?" సాయిబుగారి ప్రశ్న.

"పేన్ కిల్లర్స్ కేవలం నొప్పిని మాత్రమే తగ్గిస్తాయి. ఆపరేషన్ తప్పనిసరి. ఆ తర్వాత కొన్ని నెలలు ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. అప్పుడే జబ్బు నయమయ్యేది..." చెప్పారు డాక్టరుగారు.

"డబ్బు ఎంత ఖర్చవుతుంది డాక్టరుగారూ..."మెల్లగా అడిగాను నేను.

"మీరెందుకమ్మా ఆలోచిస్తారు? మీ సాయిబుగారు ఖర్చు పెడ్తారు... ఫీజు, డేటు అన్నింటినీ బయట రిసెప్షన్‌లో అడిగి తెలుసుకోండి. అయినంత త్వరగా ఆపరేషన్ చేయించుకుంటే మంచిది..." అన్నారు డాక్టరు.

"సరే డాక్టరుగారూ... వస్తాం..." ఆయన లేవగానే నేనూ టేబుల్ పైన చెయ్యిపెట్టి నిధానంగా లేచాను.

"సిస్టర్... వీరి ఫైల్ రిసెప్షన్‌లో ఇవ్వండి. నా షెడ్యూల్ చూసి డేట్ ఫిక్స్ చేయమనండి. ఆపరేషన్‌కు ముందురోజు అడ్మిట్ కావాలి" సిస్టర్‌తో డాక్టరు చెప్పారు.

ఇద్దరం మెల్లగా బయటకి వచ్చాం. రిసెప్షన్‌లో విచారించగా అన్నీచేరి నలభైవేలు అవుతుందన్నారు. ఇద్దరం గుడ్లు తేలేసి, నోర్లు తెరిచాం. అంత డబ్బు లేదని కాదు... అంతవుతుందని మేము అనుకోలేదు.

"నాకు ఈ మాయదారి రోగం ఎందుకు వచ్చింది సాయిబ్‌జాన్... ఏమి కర్మం చేశానో..." మావారితో బాధగా అన్నాను.

"అలాంటి మాటలు ఆడొద్దు... చూడు, ఎలాగూ వచ్చాం. మరునాటికి డాక్టరుగారు ఫ్రీగా ఉన్నారు. నిన్ను ఈరోజే అడ్మిట్ చేసేస్తాను. నేను ఊరెళ్లి డబ్బు జోడించుకుని వస్తాను, సరేనా..." సాయిబ్‌గారు అడిగారు.

సరేనన్నట్లు తలూపాను. ఈ నొప్పి, ఈ బాధ, ఈ జబ్బు వీటినుంచి ముక్తి దొరికితే చాలనే మట్టానికి చేరుకుని వున్నాను.

వారివైపే కృతజ్ఞతగా చూశాను. ఓ బిడ్డను కూడా నేను కనివ్వలేదు. అయినా నా గురించి ఎంత ఖర్చు, బాధ, శ్రమ వారికి.

"భోంచేసి బస్సెక్కండి, వూరు చేరేసికి పొద్దెక్కిపోతుంది" అన్నాను.

"అలాగేలే... నుసరత్ ఏమైనా తయారు చేసి వేచియుంటుందిలే..." అంటూ వెళ్లారు.

జనరల్ వార్డులో నన్ను చేర్పించి సాయిబుగారు వెళ్లిపోవడంతో నాకు బేజారనిపించింది. 'నుసరత్' పేరెత్తి నా నొప్పిని మరింత తీవ్రం చేసి వెళ్లిపోయారు మా వారు.

'నుసరత్! ఈయనకు రెండవ పెళ్లాం. నాకంటే పదేళ్లు చిన్నది. ఒక మగబిడ్డని కనిచ్చి ఇంట్లో నా స్థానాన్ని ఆక్రమించుకుంది. నేర్పరి. మాటల మల్లి. నాలా కాదు. రెండవ బీబీగా వచ్చినా సాయిబుగారి ఇంట్లోనూ, మనస్సులోనూ మొదటిస్థానాన్ని పొందింది.

ఆ అల్లాకు కరుణే లేదు. ఐదు పూటలూ నిష్ఠగా నమాజు చేసినా నా ఒడిని ఎందుకు ఖాళీగా ఉంచాడు? తవైఫులా అలంకరించుకుని తిరిగే ఆవిడకెందుకు తల్లి అనిపించుకునే భాగ్యాన్నిచ్చాడు?... ఛ... ఇలా ప్రశ్నించరాదు... వాని ఇచ్ఛను ప్రశ్నించడానికి నేనెంతమాత్రురాలిని?

అయినా... అయినా... ఆ అబ్బాయి రహీములో వీరి పోలిక ఏ మాత్రమూ లేదు. వాడు నుసరత్‌లా కూడా లేడు. ఎవర్నో గుర్తుకు తెస్తాడు. ఇప్పుడు వాడికి పన్నెండేళ్లు. ఎదుగుతున్నప్పుడల్లా వాడు నుసరత్ పుట్టూరు నుంచి వచ్చి వెళ్తున్న ఆమె తమ్ముడి స్నేహితుడు...కరీమ్‌లాగా...! జోరుగా తల

## టాబూకు గంగూలి భార్య విందు!

'చాందినీ బార్' చిత్రంలో టాబూకు ఉత్తమనటిగా జాతీయస్థాయిలో అవార్డు వచ్చిన విషయం అందరికీ విదితమే. అయితే 'బెంగాల్ ఫిల్మ్ జర్నలిస్టుల అసోసియేషన్' కూడా టాబూకు అవార్డును ప్రకటించింది. ఈ అవార్డు అందుకోవడం కోసం టాబూ ఇటీవల కలకత్తా వెళ్లనపుడు ఇండియన్ క్రికెట్ కెప్టెన్ సౌరబ్‌గంగూలి భార్య డోనా టాబూకోసం ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేసింది. ఒకవేళ 'నగ్మా'కే అవార్డును ప్రకటిస్తే డోనా పార్టీ ఇచ్చేదా...? అని కొంతమంది చెవులు కొరుక్కున్నారట...!

జె.



విదిలించుకున్నాను.

ఛ, ఇలాంటివన్నీ ఆలోచించరాదు. ఏ జన్మలో ఎవరికేం కీడు చేశానో ఈ జన్మలో గొడ్రాలిలా, ఈ జబ్బుతో బాధపడుతున్నాను. నుసరత్ తప్పు చేసివుంటే ఆవిడ అనుభవిస్తుంది. 'చేసినోళ్లు పాపం, ఆడినోళ్ల నోట్లో...' అని ఆవిడ పాపభారాన్ని నేనెందుకు మోయాలి?

మరో పక్కకు దొర్లాను. కళ్లు మూసి నిద్రించడానికి ప్రయత్నించాను. నలభైఎనిమిది ఏళ్లు గడిచిపోయాయి. మరో ప్రపంచమే తెలియదు. లేవడం, వంట చేయడం, తినడం, పడుకోవటం... అంతే. జీవితంలో ఏమీ సాధించలేకపోయాను. ఆఖరుకు, కనీసం ఓ బిడ్డను కూడా కనలేదు... ఈ ప్రపంచాన్ని వదిలి వెళ్లిపోవడానికి ఇక్కడి ఏ బంధమూ అడ్డురావు. ఏ వ్యామోహమూ ఆపలేవు... అయినా బ్రతకాలనీ ఆశ... ఎందుకు? ఎందుకు బ్రతకాలి? మరింత తిని, మరింత గలీజు చేసి, పడుకొని నిద్రించడానికి ఎందుకు బ్రతకాలి?

బ్రతకాలి... చావంటే భయం కనుక. చనిపోయిన తర్వాత ఏమో, ఎటో అని తెలియకుండా చావును ఎలా ఒప్పుకోవడం?

ఈ రోజే ఆపరేషన్. నర్స్ వచ్చి మందులిచ్చి సిద్ధం చేసి వెళ్లింది. కానీ వీరి జాడ లేదు...! వాకిలి వైపు తిరిగి చూస్తూ చూస్తూ మెడ నొప్పెట్టిందే గానీ వీరు రానేలేదు. బహుశా రిసెప్షన్‌లో డబ్బు కడుతున్నారేమో. నిన్న రాలేకపోయారు కదా. ఈ రోజు నాస్తా చేసి కదిలి వచ్చే లోపల ఆలస్యం అయివుంటుంది. డబ్బు కట్టింతర్వాతే వచ్చి నన్ను చూస్తారేమో... వచ్చేప్పుడు నా అన్నయ్య వాసీమ్‌ని తోడుగా పిలుచుకొస్తారో లేదో... మొన్న నేను అలా అని చెప్పానో లేదో... జ్ఞాపకం లేదు... ఛ... నా పుట్టింటివైపున వున్న బంధువంటే అన్నయ్య ఒక్కడే. వాడికి చెప్పాలని వీరికి తెలియదా ఏమిటి... ఖచ్చితంగా చెప్పివుంటారు.

వాసీమ్ భార్య రాకున్నా, వాసీమ్ తప్పకుండా వస్తాడు.

తెల్లదుస్తుల నర్స్ దగ్గరకు రాగా చిన్నగా నవ్వాను.

"మా సాయిబుగారు వచ్చారా...?" అడిగాను నర్స్‌ను.

"ఔను... మీ సాయిబుగారు వచ్చారు. ఇంటికెళ్లడానికి రెడీగా వుండండి" చెప్పింది.

"ఇంటికా..." ఆశ్చర్యపోయాను. "ఈరోజు నాకు ఆపరేషన్ కదా?.. ఆపరేషన్ తర్వాత ఎనిమిది రోజులు ఇక్కడే వుండాలని చెప్పారు డాక్టరుగారు. మీరేమో ఇప్పుడే నన్ను ఇంటికి పంపివేసే సన్నాహంలో ఉన్నట్టున్నారు...".

రాత్రంతా నిద్రరాక నొప్పితో బాధపడింది జ్ఞాపకమొచ్చి శరీరం కంపించింది. అబ్బా... ఈ ఆపరేషనొకటి అయిపోయి, జబ్బు నయమై... నేను ముందు మాదిరిగా వుంటే చాలు... ఇంకేమీ అక్కర్లేదు.

"ఏం... మీకెవరూ వచ్చి చెప్పనే లేదా?... ఇప్పుడు అంత డబ్బు కట్టడం అవ్వదు... ముందెప్పుడైనా ఆపరేషన్ చేయిస్తాను. డిస్చార్జ్ చేసెయ్యండి... అంటున్నాడు మీ భర్త. మీకు డబ్బుకు అంత ఇబ్బందా? ఆరోగ్యాన్ని నిర్లక్ష్యించేటంత?" వ్యంగ్యమైన నవ్వు కనిపించింది ఆమె పెదవులపైన. ఆమె వైపే చూస్తున్నాను ఆశ్చర్యంగా.

వీరెందుకిలా చేస్తున్నారు? ఎవరో గుండెను పిండినట్టయింది. జీవితాన్నంతా వారికోసం వెళ్లబుచ్చిన నాకోసం నలభైవేలు ఖర్చు పెట్టడానికి సిద్ధంగా లేరా? రెండు థియేటర్లు నడిపే వీరికి పేదరికమా...? లేదా... నేనంటే అంత నిర్లక్ష్యమా...? నువ్వు చస్తే చావు... ఇంకో పెళ్లాం ఉందికదా అనే ధీమాయా?"

నాకు తెలియకుండానే కళ్లల్లోంచి అశ్రువులు రాలి బుగ్గల్ని తడిపేశాయి. నిజమే. పాలివ్వని పశువుకు మేత వేయడం దండగ. నేను బ్రతికి మాత్రం ఏం సాధించాలి? ఏ వూరును ఏలాలి? ఏ బిడ్డ తల్లిలేని అనాథగా మిగులుతుంది? ఏమీ లేదు... చావటమే నయం. నిజమే... కానీ చావు మన చేతిలో లేదు కదా... ఇలాగే కృంగి... కృంగి... చావాలా...

"మా సర్జన్‌గారిది గొప్ప ఆడ హృదయం. వారు ఫీజును వదులుకోటానికి సిద్ధంగా వున్నారు. ఆస్పత్రి చార్జీలు కూడా కట్టలేము అంటే ఎలా?" నా అశ్రువుల్ని... నా దుఃఖాన్ని... నా భావనల్ని గమనించడమే లేదు ఆ తెల్లదుస్తుల నర్స్...

"ఏదైనా ఇబ్బంది వుండొచ్చు. ఇప్పుడు నా కడుపునొప్పి తగ్గింది లెండి" మెల్లగా చెప్పాను.

డాక్టరుగారు, సాయిబుగారూ ఇద్దరూ వార్డులోపలికి వచ్చారు.

"చూడండి నా ఫీజును మీరు ఇవ్వొద్దు. కానీ ఆస్పత్రి చార్జీల గురించి నేనేమీ చెయ్యలేను... ఆలోచించండి... ఆమె ప్రాణానికి అపాయం... ఆమె నా తల్లిలా వున్నారు..." డాక్టరు చెప్పారు.

"ఆవిడ నీకెందుకు తల్లిఔతుంది నాయనా...? వెళ్లు... వెళ్లు... వున్న వేరే పనులు చూసుకోపో... షకీలా... పద... పొద్దవుతుంది" నిర్లక్ష్యంగా చెప్పారు సాయిబుగారు.


డాక్టరుగారు మరోమాట ఆడకుండా వెళ్లిపోయారు. చీరకట్టుకుని, బుర్ఖా ధరించి బాత్‌రూమ్ నుంచి బయటికొచ్చాను.

వార్డులో సాయిబుగారు కనిపించలేదు. నా బ్యాగ్ తీసుకుని వార్డు నుండి బయటికొచ్చాను. రిసెప్షన్ డెస్క్ దగ్గర వాసీమ్ అన్నయ్య డాక్టరుగారితోనూ, వీరితోనూ మాట్లాడుతున్నాడు. నేను మెట్లు దిగి వచ్చేలోపల మావారు బయటికి వెళ్లిపోయారు. అన్నయ్య చేతిలో నోట్లకట్ట వుంది. వీరితో మాట పడి వెళ్లిన డాక్టరుతో చేతులు

## మళ్లీ అమితాబ్‌బచ్చన్ సరసన జయప్రద...?

రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఖాకీ' చిత్రం కోసం అమితాబ్‌బచ్చన్‌ను నిర్మాత కేశురామ్‌సే ఇదివరకే ఎంపిక చేయగా, తాజాగా ఈ చిత్రంకోసం జయప్రద సంతకం చేసింది. గతంలో 'షరాబీ, ఆజ్‌కా అర్జున్, ఆఖరీ రాస్తా' వంటి సూపర్‌హిట్ చిత్రాల్లో అమితాబ్ సరసన జయప్రద నటించింది. ఈ చిత్రంలో జయప్రద కోసం అమితాబ్ సిఫారసు చేసి ఉండవచ్చని పలువురి ఉవాచ. ఇందులో ఇంకా అగ్రశ్రేణి నటులు అక్షయ్‌కుమార్, అజయ్‌దేవగణ్, అక్షయ్‌ఖన్నాలు నటిస్తున్నారు.

జె.



జోడించి నమస్కరిస్తూ అన్నయ్య ఏమో ప్రాధేయపడుతున్నాడు.

"భయ్యా...! ఎలా వున్నావు భయ్యా...? ఇప్పుడు ఆపరేషన్ చేయించుకోవటం లేదు. ఊరుకొచ్చేస్తున్నాను..." చెప్పాను అన్నయ్యతో.

"ఔనట... సలీం చెప్పాడు... వాడికి ఇంకో పెళ్లాం ఉండొచ్చు. ఖయాలనిపిస్తే మరో పెళ్లాన్ని తెచ్చుకోవచ్చు. కానీ నాకున్నది నువ్వొక్కత్తవే చెల్లెలు. అందుకే నేను డబ్బు జోడించుకొచ్చాను షకీలా బహెన్..." వాసీమ్ ఆప్యాయంగా నా తల నిమురుతూ చెప్పాడు.

"భయ్యా..." ప్రేమ నిండిన కళ్లతో అన్నాను.

"నువ్విప్పుడు డిస్చార్జ్ కావద్దు. నేను డబ్బు కడ్తాను. ఆ విషయాన్నే డాక్టరుతో మనవి చేసుకుంటున్నాను. డాక్టరుకు ఈ రోజు కుదరదట. వేరే కేసులున్నాయి... మరో నాలుగురోజులు తర్వాత డేట్ ఇస్తానని అన్నారు..." చెప్పాడు అన్నయ్య.

"వీరు... వీరు..." మావారి గురించి అడిగాను.

"సరేలే! డబ్బు చెయ్యి జారకుండానే నువ్వు కోలుకుంటే సలీం ఎందుకు వద్దంటాడు? అయితే... ఈ నాలుగు రోజులు ఏం చేసేది అని ఆలోచిస్తున్నాను. ఇక్కడే వుండటానికి నీకేమీ కష్టమనిపించదా బహెన్..." అన్నయ్య అడిగాడు.

"కోలుకున్న తర్వాత ఏం చెయ్యను భయ్యా..." సూటిగా అడిగాను.

"అలా అంటావేమిటి? కోలుకుని, హాయిగా ఏ బాధా లేకుండా సంసారం చేసుకుంటూ వుండిపో..." చెప్పాడు అనునయంగా.

"ఎక్కడ అన్నయ్యా... ఎవరితోటి?" నా ప్రశ్నతో అన్నయ్య తడబడ్డాడు.

"షకీలా బహెన్.. ఎందుకలా అడుగుతున్నావు... నీ భర్తతో..." అన్నాడు ఆశ్చర్యంతో.

జోరుగా నవ్వాను. అక్కడున్నవారందరి చూపులూ నావైపుకు మళ్లాయి. ముఖం మీద బుర్ఖా ముసుగు లేదనే విషయం నాకు తెలిసిరాలేదు...

"భర్తతో? నన్ను పాలించే బాధ్యత వహించిన నా సాయిబుతో?... నా చికిత్సకు డబ్బు ఖర్చు పెట్టడానికి ఇచ్ఛపడని అతని సేవలు చేసుకుంటూ, నా మిగిలిన జీవితాన్ని గడపమంటావా భయ్యా...? చస్తే చావనీ అని నన్నిక్కడ్నించి తీసుకువెళ్తున్నారుగా... వారి సేవ చేయడం కోసం నాకిప్పుడు చికిత్స చేయిస్తావా భయ్యా? ఇప్పుడే, నేను ఇల్లు చేరుకునేముందే, నాకు చావు రావాలని దీవించు అన్నయ్యా చాలు..." జబ్బు బాధిస్తున్నా దిట్టంగా చెప్పాను.

"షకీలా బహెన్... ఎందుకలా మాట్లాడతావు... సలీంకు ఏం ఇబ్బందులున్నాయో ఏమిటో... నేను ఆపరేషన్‌కు డబ్బు ఇస్తానుగా... పంతం పట్టొద్దు...షకీలా బహెన్.... నాకు మాత్రం రక్తసంబంధం అంటూ నువ్వు తప్ప ఎవరున్నారమ్మా..." అన్నయ్య కంఠం గద్గదితమైంది.

"అలాగైతే నన్ను, నీ ఇంటికి తీసుకెళ్తావా భయ్యా..." అన్నయ్య కళ్లల్లోకి చూస్తూ అడిగాను.

"షకీలా..." అన్నయ్య ఏదో చెప్పబోతుండగా నేను

"ఏదో డబ్బు ఖర్చుపెట్టి చికిత్స చేయించగలవు నువ్వు. కానీ నీపెళ్లాం, బిడ్డలతో వుండడానికి, నీ ఇంటికి నన్ను పిలుచుకు వెళ్లగలవా భయ్యా!... దేవుడు కరుణామయుడు. మావారి స్వార్థం నాకు తెలిసే మునుపే నన్ను తనదగ్గరికి తీసుకునేందుకు ప్రయత్నించాడు. కానీ... నా దురదృష్టం, ఈ ఆస్పత్రిలో, నా దైహిక జబ్బుకు ముక్తి దొరక్కపోయినా, వీరి మనస్సు మాత్రం తెరచివుంచిన పుస్తకమయ్యింది..." అన్నాను నొప్పిని అణుచుకుంటూ.

"బహెన్..." అన్నయ్య గొంతు బొంగరవోయింది.

"నాకు బ్రతకాలనీ ఆశలేదు భయ్యా... ఇప్పుడు కూడా వారివెంట, వారి ఇంటికి వెళ్లడానికి మనసు లేదు. కానీ విధిలేదు. పనిచేసి, సంపాదించి నన్ను నేను పోషించుకోనప్పుడు బ్రతికి ఉండకూడదు. నువ్వూ నాన్నా ఇద్దరూ తప్పు చేశారు... నాకు పెళ్లి చేసే బదులు నన్ను చదివించి వుంటే నా కాళ్లపై నేను నిలబడగలిగేదాన్ని. నా జబ్బు నయం చేసుకోడానికి... ఛ... ఏమేమో మాట్లాడి నిన్నెందుకు బాధించాలి... భయ్యా... సాయిబుగారు వేచియుంటారు. నే వచ్చేదా భయ్యా..." చెప్పాను కళ్లలోంచి నీరు జారుతుండగా.

"షకీలా బహెన్... చూడు, ఏవేవో ఆలోచనలు చేయకు. నేను చెప్పినట్టు విను..." అన్నయ్య నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు.

"కానీ... భయ్యా... డబ్బు చేతబట్టుకుని నన్ను బ్రతికించుకోవాలని నువ్వు వచ్చావు చూడూ... అది చాలు నాకు... ఈ ప్రపంచంలో నాకెవ్వరూ లేరనే భావనను దూరం చేశావు... నీకు నేనేమీ చేయకున్నా, నన్ను కాపాడుకుందామని నువ్వు వచ్చావు... తృప్తిగా చావడానికి నాకు ఇది చాలు..."

బుర్ఖా ముసుగు వేసుకుని బయటికొచ్చాను.

■

## ఇక 'తల్లి' పాత్రలో మాధురీదీక్షిత్!

'దేవదాసు' చిత్రం అనుకున్నంత సక్సెస్ కాకపోవడంతో మాధురీదీక్షిత్ సినిమాలకు కొంతకాలంపాటు విరామమిచ్చి సంసారసాగరంలో మునిగిపోయింది. మాధురీదీక్షిత్ గర్భవతి అన్న విషయం అందరికీ విదితమే. ఈ విషయంలో తాజా వార్త ఏంటంటే... ఏప్రిల్, 2003లో మాధురీ తల్లి కాబోతోంది. అయితే ప్రసవం అమెరికాలోనే. ఎందుకంటే పుట్టబోయే బిడ్డకి అమెరికా పౌరసత్వం దక్కాలిగా మరి! ఎన్నో పాత్రలు వేసి అందరినీ మెప్పించిన మాధురీ ఇక తల్లి పాత్రలో జీవిస్తదన్నమాట!

జె.

